బ్రతుకు బరువు

శ్రీ కాసారం కుప్పస్వామి

పది సంవత్సరాల క్రితం ఉద్యోగాన్నుంచి విరమించుకునే సమయంలో పుట్టించుకున్న కోటు తొందర తొందరగా తొడుక్కుంటూ జేబులు తడుముకున్నాడు రామయ్య పంతులు. ఒక జేబులోనుంచి చేయి అవతలకు వెళ్ళి వెకిలిగా వెక్కిరించింది. మరొక జేబులోని చిరిగిన పేలిక పంక్తికిలించి నవ్వింది. జేబులన్నిటినీ గజిబిజిగా వెతుక్కుంటున్న రామయ్య పంతుల్ని చూసి ఊడిన కుట్లు, చిరిగిన బొత్తాములు, పాలిపోయి కూడా పాతబంధాన్ని పుటుక్కున త్రెంచుకోలేని గుండీలు పరిదీనంగా ముఖ వళికలు పెట్టినవి. జేబులు తడుముకుంటూనే 'దివా! ఓ దివిగా! అని యిల్లు దద్దరిల్లేటట్లు కేకలు వేశాడు పంతులు.

బిక్కు బిక్కుమంటున్న గుండెలను సరిదిద్దుకుంటున్నట్లు, చొక్కా గుండీలను త్రిప్పుకుంటూ ఎనిమిదేండ్ల బాలుడొకడు నక్కి నక్కి వచ్చి గోడకానుకొని నిల్చున్నాడు.

"ఓరే! జేబులోని పొట్లం ఏదిరా?' గద్దించాడు పంతులు.

గుండెలు తడబడగా పై ప్రాణం పైనేపోయినట్లు భయంతో గజగజలాడిపోయాడు దివాకర్. నోటినుంచి మాటరావటం లేదు.

'నిన్నేరా అడిగేది? గుడ్లప్పజెప్పి చూస్తావేం? కోపంతో పంతులు పెదవులు వణికిపోతున్నాయి. గద్దిస్తూ బాలుని సమీపించాడు.

'తీశాను నాన్నా తీశాను. మాటలు వాటంతటవి వచ్చాయి. తిరుగుతున్న గ్రామఫోనుమధ్య ఉన్నట్టుండి సూదినానిస్తే వచ్చినట్లున్నాయా మాటలు.

'ఏం జేశావు?' గర్జించాడు పంతులు.

"మరే...మరే...పక్కింటి అవ్వ జ్వరంతో వుంటే...తీసుకెళ్ళి కాఫీ కాచిచ్చాను నాన్నా! అన్నమే లేదంది అవ్వ అందుకని...భయంతో తడబడుతూ చెప్పుకపోతున్నాడు దివాకర్.

ఫెడీ ఫెడీమని చెంపలు వాగిపోయాయి. "అందుకని కాఫీ కాచిచ్చావా భడవా? ఇంట్లో పెద్దల నడక్కుండా చేస్తావా అపని?" చెంపలు కందిపోయాయి. పిచ్చివానిలా దివాకర్ని బాదేస్తున్నాడు పంతులు. గగ్గోలుగా ఏడుస్తూ అటూ యిటూ పరుగెత్తాడు దివాకర్. 'అమ్మా!' అని పొలికేకలు వేస్తూ తలుపుదగ్గరకు వెళ్ళి తలుపు తగిలి బోరగిలపడ్డాడు.

'నా నాయనా' అంటూ పరుగెత్తివచ్చి దివాకర్ను ఒడిలోనికి తీసుకొని గుండెలకు హత్తుకొంది ఆదిలక్ష్మమ్మ కోప శోకాలు ఆమె హృదయాన్ని మార్చివేయగా "ఏమిటండీ మీరు? బాగా కొట్టారు గాని" అంది.

'వాణ్ణి కొట్టడమేనా? చంపేయాలి. జేబులోని చక్కెర పొట్లంతీసి ప్రక్కింటవ్వకిస్తాడా? ఇప్పుడిన స్పెక్టరు గారికి ఏం బెట్టి కాఫీ కాచిచ్చేది? ఈ దొంగబుద్ధులు ఎవడు నేర్పాడు వీడికి? భృకుటీ తటముల దుర క్రుద్ధురుముతూ చేయి పైకెత్తాడు పంతులు.

ఆదిలక్ష్మమ్మ ప్రక్కకు తప్పుకొని 'అవునా దివా?' అని గదించింది దివాకర్ యింకా భయభీతుడై ఔనన్నట్లు తలవూపాడు. 'ఎందుకు తీశావు? అలా తీయవచ్చా?' కసురుకుంటూ దివాకర్ను చంక నుండి క్రిందకు దించేసింది ఆదిలక్ష్మమ్మ.

క్షమాపణ కంఠస్వరంలో ధ్వనింపగా 'అమ్మా! తప్పు చేశానే. ఇంట్లోనే కదా కదా అని తీశానే! ఇంక నేనెప్పుడూ చేయనే. ఇంక చేస్తే నన్ను చంపేయండే...వెక్కి వెక్కి ఏడుస్తూ గబ గబా గుంజీళ్ళు పెడుతున్నాడు దివాకర్.

తల్లికి కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగినవి. ఆదిలక్ష్మమ్మ ఉద్వేగంగా దివాకర్ను ఎత్తి గుండెలకు హత్తుకొన్నది.

రామయ్య పంతులు దివాకర్ను అందుకుంటూ గద్గదకంఠంతో 'అలా చేయవచ్చా మరి?' అన్నాడు.

'అక్క బువ్వతిని నాల్గురోజులైందట. ఆకలిగా వుందంటే కాఫీ కాచిచ్చాను నాన్నా!' ఏడ్పు నదుముకుంటూ దివాకర్ అంటున్నాడు.

'మంచిదే నాయనా! దొంగతనం చేయవచ్చా?'

'ఇది దొంగతనమా?' ఆశ్చర్యముగా అడిగాడు దివాకర్.

'కాదా మరి? అడక్కుండా చాటుగా తీయడము దొంగతనం కాదా?'

'దొంగతనమని తెలియదు నాన్నా. ఇక తీస్తే నరికేయండి నాన్నా!'

చంకలోనుంచి దిగజారుతున్నాడు దివాకర్. పంతులు దివాకర్‌ను వక్షస్థలానికి గట్టిగా అదుముకున్నాడు. అతని కళ్లలోనుంచి అశ్రుబిందువులు జారినవి. పంతులుగారి అర్ధనిమీలిత నేత్రాలు చూసి ఆది లక్ష్మమ్మ కన్నులరమోడ్చి నమస్కరించుకొంది. దివాకర్‌ను మెల్లగా తన చేతులలోనికి తీసుకొంది.

ఐదారుమంది పిల్లలు 'నాన్నా! నాన్నా! ఇనస్పెక్టరు వచ్చేశారు నాన్నా. రా నాన్నా వెళ్దాము' అంటూ ఏకకంఠంగా అరుస్తూ వచ్చారు.

'వచ్చేశారా! వస్తున్నాను. మీరు పదండి' అని కోటు సర్దుకుంటూ 'లక్ష్మీ రెండణాలుంటే యివ్వవే. పోయినా యివ్వకుంటే ఏం బాగుంటుంది నాకు ఎగ్జంప్షన్ అయినా యిస్తాడా?' ప్రాధేయపడ్డాడు రామయ్య పంతులు.

'లేదండి.' ఆ శోకస్వరంలో జాలికూడా పాలు తీసుకున్నది.

దీర్ఘంగా నిట్టూర్చి ముందుకు నడిచాడు రామయ్య పంతులు.

'నమస్కారమండీ పంతులుగారూ!' సుపరిచిత కంఠం పలుకరించటంతో చుటూ కలయజూశాడు. విలువగల మాటుబూటుల ధరించి ఠీవిగా నిలుచున్న నల్ల కళ్లద్దాల మనిషి కనిపించాడు. ఎవరైందీ తెలియక తికమక పడుతున్నాడు—'ఆ యినస్పెక్టరు మారిపోయి యీ క్రొత్తాయన వచ్చాడా?...నాకు నమస్కార మంటాడేం?'...

ఏమిటండోయ్? గుర్తించలేనట్లున్నారు. నేను రంగనాథాన్నిగదూ! అప్పుడే మరిచిపోయారా?' అంటూ కళ్ళద్దాలు చేతికితీసుకున్నాడా నూతనవ్యక్తి.

'ఓఁ! నీవారంగనాథం? ఎన్నాళ్ళకు? ఎన్నాళ్ళకు...? ఇపుడెక్కడున్నావు? ఇటెక్కడికి వెళుతున్నావు? మాకు క్రొత్త యినస్పెక్టరేమైనా వచ్చాడేమోనని బెదిరిపోయానుగదయ్యా!...

'ఓహో! అదా సంగతి? ఈదినం మీ యినస్పెక్టరుగారు రారయ్యా! బస్సులో తారసిల్లారాయన. మాటామాటామీద ఆయనగారు యినస్పెక్టరని యీవూర్లో మీరు పనిచేస్తున్నారని తెలుసుకున్నాను. నేను యిటు కడప వెళేవాడిని ప్రయాణం ఆపుచేసుకుని మిమ్మల్ని చూచిపోదామని దిగానయ్యా. ఏం? అలా వున్నావే? యిన్ని దినాలయ్యాక నీదర్శనం? మనం ట్రయినింగ్ స్కూల్లో గడిపిన జీవితాలు మరిచిపోయారేమిటి...?" రంగనాథం హాస్యధోరణిలో మాటాడుకుంటూ పోతున్నాడు.

ఆఁ ఆఁ! ఎలా మరవగలం రంగనాథం...? అంతా క్షేమమేనా? మనిషే మారిపోయావే!' పంతులుగారి మాటలు తడబాటులో ఆశ్చర్యాన్ని వ్యక్తంచేస్తున్నవి. ఆశ్చర్యానికి మరుగున విషాదం అస్పష్టంగా వుంది 'స్కూల్లో పిల్లలరుస్తుంటారు. అక్కడికెళ్లి వద్దాంపదండి రంగనాథం...'

ఫకఫకా నవ్వేశాడు రంగనాథం. 'స్కూలేమిటయ్యా? లీవు చెప్పేశాను. నేను పోగానే నన్ను ఇనస్పెక్టరనుకున్నారు పిల్లలు. నాకొక్క వలసిన మీయింటి అడ్రసు కనుక్కొని యినస్పెక్టరు హోదాలో నే స్కూలుకీదినం లీవు చెప్పేశాను. నీ పెద్దకుమారుడు కాబోలు, స్కూలు మూసేసి వస్తున్నాడు. పదవయ్యా యింటికి" దడదడా మెయిలులా చెప్పుకపోతున్నాడు రంగనాథం.

గుడ్లప్పగించి నోరు తెరిచేసుకుని ఆశ్చర్యంగా రంగనాథాన్ని చూస్తున్నాడు రామయ్యపంతులు. ఇంతలో బీగాలగుత్తి ఆడించుకుంటూ ఒకడు పరుగెత్తుకుంటు వచ్చి 'వీరివే నాన్నా! ఈం యినస్పెక్టరండి' అన్నాడు.

'సరే బాగుంది. వీరి సూట్‌కేసు తీసుకుని యింటికి నడు' అన్నాడు రామయ్యపంతులు.

'ఏం రామయ్యా! ఎలావుంది బ్రతుకు? ట్రయినింగ్‌లో అందరినీ సవాలుచేస్తుంటివే. మేమంతా పిచ్చివాళ్లమని? నీవేమో మహాధర్మాత్ముడవైనట్లు!...

అనాడు మా యింటికి వచ్చావు కదూ! ఎన్ని ఏండ్లయిందియ్యా!...' గతంలో సంచరిస్తూ రంగనాథం. ఆనాడు విందుచేయగా రామయ్య తప్పులు పట్టిన ఒక ఘట్టాన్ని జ్ఞాపకం చేశాడు.

పంతులుగారు ఇక్కడ వినడం లేదు. మధ్యమధ్య అసందర్భంగా పూకొడుతూ ఒకటి రెండు మాటలు మాట్లాడుతున్నాడే గాని, అతని మనస్సు ఎక్కడో సంచరిస్తున్నది. జరుగబోయేదాన్ని ఆలోచిస్తున్నది.

ఇల్లు సమీపించింది. ఇంటిలో సూట్‌కేసు పెట్టించి ఒక నులక మంచం వేసి రంగనాథాన్ని కూచోమన్నాడు. రంగనాథం ఏమిటేమిటో మాట్లాడుతూ కోటు తగిలించేందుకు కొక్కెము, కూర్చునేందుకు కుర్చీ యిత్యాదులకోసం అడిగి తెలుసుకుంటున్నాడు. పెద్దపిల్లవాడు చెంబులో నీళ్ళిచ్చి కాళ్ళు కడుక్కోమన్నాడు.

'కడుక్కున్నంత పుణ్యం. కాఫీనీళ్ళు ముందు పట్టుకురావోయి!' నవ్వుతూనే రంగనాథం అనేస్తున్నాడు.

“కడుక్కోండి రంగనాథంగారూ! తర్వాత నేను చూస్తాను. మీరిక్కడ కూర్చోండి.” అంటూ వంటయింటిలోనికి నడిచాడు రామయ్యపంతులు.

'ఎవరండీ ఆయన! రావడంతోనే కాఫీ అని కలవరిస్తున్నారు.' ఆదిలక్ష్మమ్మ చిరునవ్వుతో అడిగింది.

'ఆయనా? నా చిన్ననాటి స్నేహితుడు-రంగనాథం. ఇద్దరం కలిసి ట్రయినింగ్ చదివాము. ఇంట్లో కాఫీపొడి లేదుకదూ! పాలుకూడా లేవాయె. ప్రక్కింటి మంగమ్మనడిగైనా తవ్వెడుపాలు తీసుకురావే.” తొందర తొందరగా రామయ్యపంతులు మాట్లాడుతున్నాడు.

“ఏమిటండీ! ఆయన యీపూట కిక్కడే మకాం వేస్తారా ఏమిటి?” కొంపమునిగిపోతున్నట్లు ప్రశ్నించింది ఆదిలక్ష్మమ్మ.

'అవునే. ఈ పూటకు బియ్యమున్నాయా లేవా?' తటపటాయిస్తూ అడిగేశాడు పంతులు.

లేవని ఆదిలక్ష్మమ్మకు బాగా తెలుసు. కానీ ఆ మాట వెంటనే చెప్పివేయలేదు. పతి చూస్తూండగా ఓ మారు కుంపెలుదించి 'లేవు గదండీ ఇంట్లో అన్నీ అలానే వున్నాయి. అయితే ఆయన తప్పకుండా వుంటాడంటారా?' అమాయకంగా అడిగింది.

'ఉంటాడే లక్ష్మీ. సరిచేయగలవటే!' దీనత్వం గుండెలు కరుగదీస్తున్న స్వరంలో అన్నాడు. జవాబును నిరీక్షించకుండానే 'నేనూ అలా బజారుకు వెళ్ళివస్తా'నంటూ పెరటి దారిన వీధిలోనికి గబగబా నడిచాడు పంతులు.

2

కాలచక్రం నిర్విరామంగా పరిభ్రమిస్తూనే వుంటుంది. ఇరుసున కందెన బెట్టక పరమేశ్వరు బండియైనా నడవదన్నారు. కానీ యీ కాలచక్రానికి కందెన వేసేదెవరో? నడిపేదెవరో? దానికి అలుపూ సొలుపూ వుందో లేదో? ఎందుకలా నడుపుకపోతున్నారో?...ఈ వివరాల భోగట్టా యింతవరకెవ్వరూ తెలుసుకోలేదు. కానీ ఒక్కొక్కరు ఒక్కొక అభిప్రాయాన్ని పారేస్తూ వస్తున్నారు. ముదిరి పండిపోయిన వేదాంతులు ఇదంతా దేవుని కొక లీల అంటూ రోడ్డుపై చక్రం దొర్లవేసుకపోయే పిల్లవానికి పోల్చేసి, ఆ నగ్న సత్యాన్ని తామే గుర్తింప గలుగుతున్నట్లు ఆ గగన పథాలలో అయోమయ దృష్టులు సారిస్తారు. అదంతా వారికే ఎరుక.

అయినా...ఈ కాలచక్ర మొక్కటే తిరిగిపోతుంటే దాని ప్రమేయం మానవునికేమాత్రమూ లేకపోయేది. తనతో కోటానకోట జీవిత వలయాల లాక్కుంటూ, కాల్చివేస్తూ పోతున్నది. కాలచక్రం ఒక పెద్ద ముళ్ళచక్రం గాబోలు! దానికి మానవజీవిత వలయాలు గడియారంలోలాగా తగులుకున్న చిన్న చిన్న చక్రాలేమో! ఆ పెద్ద చక్రం ఒక చుట్టు చుట్టే సరికి చిన్నవి ఎన్నో చుట్లు చుట్టేసి మసిబట్టి శక్తిహీనములై రాలిపోతున్నవి కామోసు! అంతే అయి వుంటుంది. ఒక్క దినంలో ఎన్ని ప్రాణాలు చావడం లేదు? ఎన్ని ప్రాణులు పుట్టడం లేదు? ఈ కాలచక్ర పరిభ్రమణపరిధిలో ఎన్నో ఉత్తుంగోత్తుంగ పర్వతాలు, అట్టడుగు ముట్టుకునే అగాధమయిన లోయలు, ఆకాశం తలవగ్గునే అపార జలనిధులు, అంతూ పొంతూ లేకుండా వ్యాపించి అగ్నికణసందోహంలాగా మండిపోయే ఎండుటిసుక ఎడారులు...ఎన్నో అడ్డు వస్తున్నవి. విటికి తట్టుకోలేక దాటశక్తిచాలక యెన్నో జీవితవలయములు ఆగిపోతున్నవి. కానీ కాలచక్ర వేగం

అవగింజంత తరుగదు. ఆ తరుగుబరువులను, ఆ గమన వేగదూరాలను కొలిచే కొలతబద్దలు ఎక్కడ లేవు. ఈ త్రిమోత్తను మనుకుంటున్న మానవజీవితగమనం యే మిల్లీమీటరులోనో సహస్రాంశమౌతుంది—ఆ కాల దూరాన్ని కొలవాలనుకున్నప్పుడు!

పంతులుగారు ఆలోచిస్తున్నారు. 'డెబ్బది సంవత్సరాలు బ్రతికాను. నా బ్రతుకంతా యేమిటి? సత్యంతో చేసిన సాధనేగదా!' అంటాడు మహాత్ముడు. 'నా జీవితమంతా యేమిటి? దారిద్ర్యదేవతా సంఘర్షణే కదా!' అనుకున్నాడు రామయ్యపంతులు.

దూరంలో సుడిగాలి రేగింది. శుష్కపత్రాలు, దుమ్ము, ధూళి ఒకేసారి ఆకాశాన్ని అందుకోవాలని ఒక్కుమ్మడిగా ప్రయత్నం చేస్తున్నవి. తిని పారవేసిన పులివిస్తరాకుల వీరవిహారం ఆ గాలిలో గుర్తింపదగిన విషయం. తాళవృక్షసదృశంగా ఏర్పడిన ఆ యిసుక స్తంభం అల్లిబిల్లి తిరుగుతూ పంతులు సమీపానికి వచ్చి అదృశ్యమయింది. సుడిగాలేమిటి? అత్యుష్ణతవల్ల ఒక్కొక్కచోట భూమి వేడెక్కి వాయురహితమై పోతుంది. ఆ ఖాళీప్రదేశాన్ని ఆక్రమించుకునేందుకు చుట్టూరా వున్న గాలి సహస్రాధిక యోజన వేగంతో ప్రసరించి ఆ ప్రదేశంలో సుళ్ళుదిరిగిపోతుంది. అదే సుడిగాలి. అలా అయితే మానవజీవితాలు ఒకప్పుడు సుడిగాలులౌతాయి. ఆశాజ్యోతులు ఆరిపోగా నిరాధారమైన మానసపథంలో అంధకారప్రభంజనాలు అతివేగంగా ప్రసరిస్తాయి. ఆ తీవ్రవేగంలో సుడిగాలి లీలగా సుళ్ళు తిరిగిపోతుంది. సుఖదుఃఖానుభవాలు, అనుభూతులు శుష్కపత్రాల్లా విహరిస్తాయి. ఏమీ చేయలేని మానవుడు సుడిగాలిలా ఆకాశాన్నందుకోవాలని తన్నుతాను గతస్మృతులలో కోల్పోతాడు. సుడిగాలిలోని పచ్చనిఆకులను ఎగ్నశరీరంతో వెళ్ళి చించితే నెత్తురు కారుతుందట. హృదయాంతరాళ విషాదాంత ఘట్టాలను కెలికి వెలికితెచ్చి చించిచూస్తే నెత్తురు కారడమేగదు. హృదయం బ్రద్దలై లావాలు ప్రవహిస్తాయి. వాటి వేడిమిని, తన్నిహిత ప్రభంజనశక్తిని ఎవరంచనా వేశారు?

"ఇరవై సంవత్సరాలు అస్పష్టంగా గడిచాయి. ఇరువదియైదులో కాబోలు ట్రయినింగ్ వెళ్లాను. అది ఒకకలగా గడిచింది. ఏమో చేస్తూ ఏమో చేయాలని ఏవేవో ఆలోచనలు మానవాన్ని పీల్చి పిప్పిచేసేవి. నీటిలో తారాడే చేపకు పాచికమల్లే మిత్రులు తారసిల్లారు. అది నా జీవితానికి స్వర్ణయుగమేమో! ఆ సమయంలో కూడా మానసపథంలోనించి హృదయ సామ్రాజ్యంపై అనేక దండయాత్రలు జరిగినవి. కానీ పదిమందిలో కలిసి తిరగడం, పట్టినదల్లా బంగారం కావడం నిరాటంకంగా సాగింది. ఆ ట్రయినింగ్ స్కూల్లో రాజ్యంలేని రాజునయ్యాను. రాణీస్థానం ఖాళీగానే వుండిపోయింది. ఎందరో ఆశించారా స్థానాన్ని. అప్పుడేకదూ యీ రంగనాథం స్నేహము. నన్ను గుప్తచక్రవర్తిగా చూచేవారు. నామట్టుకు నేను పిల్లజమీదారు ననుకునేవాడను. నాచుట్టూ పదిమంది కలియదిరిగేవారు. గ్రీకుహీరోలా పోజుపెట్టి నిలిచేవాడను. సమాజం చక్కబాటును గురించి ఏదేదో వాగేవాడను. ఏదో అందుకోవాలని అందుకుంటున్నానని ఆరాటాలుండేవి. ఈతడేం రాజారాం మోహనరాయల ద్వితీయావతారమా? అని కొందరు, నాస్తికుడని కొందరూ, పిల్లవెధవాయని కొందరు నన్ను గురించి అనుకునేవారట. పిల్లవెధవన్న వారిపళ్ళు నుగ్గునూచం చేయాలన్నంతకోపం వచ్చేది. కొందరికి చేశాను కూడా. ప్రధానోపాధ్యాయుల కెదురుగా ఉపన్యాసమిచ్చానని, ఆ ఉపన్యాసం వ్యంగ్యాత్మకంగా సాగిందని వన్నాక్షేపించారు సభ్యులు. అప్పుడు రంగనాథం కూడా ప్రతిపక్షి. ఆ వేశంలో అందరినీ తిట్టపోశాను. ముక్కలు విరుగుతాయన్నాను. తర్వాతేకదూ యీ రంగనాథం పిల్లిలాగా నా ప్రక్క చేరింది! అదంతా అమ్మానాన్నల చలువ. ఒక్క చిక్కూ వుండేదిగాదు. డబ్బు నీళ్లలా ఖర్చు చేసేవాడిని. ఆ కాలం వెళ్లింది. ఇలాగనుకొని తల్లిదండ్రులను తలచుకొని కన్నులర మోడ్చాడు రామయ్య పంతులు.

"ఎంత వుబలాటపడ్డారు నా పెండ్లి గురించి! వారిముందరే నా పెండ్లి జరగాలట. వృద్ధాప్యంలో చివరికోరికట. అప్పుడే ఏమిటి లెమ్మన్నాను. ససేమిరా అంది అమ్మ. అటుకాదురా అన్నాడు నాన్న. జరిగిపోయింది పెండ్లి. ఆదిలక్ష్మి నా గృహలక్ష్మి అయ్యింది. అంటే యిప్పటికి నలభై సంవత్సరాల క్రిందటి మాట. వివాహం జరిగిన మూడురోజులు జ్ఞాపకమున్నాయి. అంతే. విడదీయరానంత చిక్కుగా జీవితఘట్టాలు సుళ్ళుదిరిగి ముడులు పడిపోయాయి. ఏమీ గుర్తు లేదు. ఏవో రెండు...మూడు స్పష్టంగా

గుర్తున్నవి. అమ్మా నాన్నలు చనిపోయారు. ఆదిలక్ష్మి మగ పిల్లవాణ్ని కనింది. పుట్టిన గ్రామములోని ఇల్లూ భూమి వేలమైపోయింది. రెండు మూడుమార్లు ఆత్మహత్యకు ప్రయత్నించాను. ఆత్మహత్య పాపమని నన్నెవరో ఆపారు. ఎవరాపింది గుర్తులేదు. ఇంకేమున్నాయి? ఆఁ. వుద్యోగాలు చేస్తూ వూళ్లు తిరిగాను. బోర్డుస్కూళ్ళు, పంచాయతీ స్కూళ్ళు, మేనేజ్మెంటు స్కూళ్ళు అన్నీ చూశాను. ఎన్ని వూళ్లు తిరిగానో గుర్తులేదు. ఏయేవూళ్లో ఏయేబిడ్డను కనిందో లక్ష్మికి బాగా తెలుసు. లక్ష్మినడిగితే ఆ వూళ్ల వివరం బాగా చెపుతుంది." నవ్వుకున్నాడు రామయ్య పంతులు. ఆలోచనల్లో గంటలకొలది తోచుబడే ఆ పలుచరన వేసవిలో మండిపడిన ఆకాశములో పద్దులేకుండా మెరిసే మెరుపులా కనిపించి మాయమయ్యింది. జీవితమంతా నిర్జీవంగా గడిచింది. మూలరాలిపోయే ముషిణికాయలా జీవితం గడిచిపోయింది. ఈ కాయను ఎవరు గుర్తించలేరు. ఈ జీవితంలో సాధించిన సన్మానాలేమున్నాయి? బాహ్య జగత్తులో శరీరానికి జరిగే సన్మానాలను ఘోర తిమిరావృత జీవితాన్ని నడుపుక వస్తున్న మనస్సు ఎలా గుర్తించగలుగుతుంది? అందుకనే జ్ఞాపకం లేదు. కందిగుంటలో కాబోలు పూలమాల వేశారు. పోయినది పోగా నాచే పునరార్జితమైన యావదాస్తిని గంజికేంద్రానికి వినియోగించానని నా త్యాగానికి ఒక్క పూలమాల విలువకట్టారు. నిట్టూర్చి నవ్వుకున్నాడు రామయ్యపంతులు.

జీర్ణజీవితంలాగా నే జేసెను కొంప వాస యోగ్యమయ్యేది. ఉద్యోగం వెలగబెట్టిన ఏవూరిలోనూ అంతకు మించినకొంప బాడుగక్కూడా దొరికేదిగాదు. ఆ కొంపలను కూడా పొగడినవారు లేకపోలేదు. చూడ నసహ్యమయ్యే ఆగుడిసెల నెందుకు వారలాపొగిడేవారో వివాహయోగ్యులయిన కుమార్తెలను జూచి తిర్వాతి వూహించుకున్నాను. కట్నాల నాశించి నే నిచ్చే కన్యాదానముల స్వీకరించారుకారు. లీల, జానకి, సరోజలను పెండ్లిచేయాలి. పెద్దవాడు కూడా వివాహ వయస్కుడే. వెధవ వానికేం పెండ్లి?...చదివివెలగ బెట్టాడా? సంపాదించి దిగదుడిచాడా? ఆదిలక్ష్మి మంచిచీర ఎన్నడయినా కట్టిందా? పాపం అభాగ్యురాలు నాకు భార్యయింది... నేనీ కోటమూర్చి ఎంత కాలమయింది? అందరూ బాకీలాంటికొట్లు రెండు మూడున్నాయనుకుంటారు. ఆదిలక్ష్మి కూడా చెప్పేదట. 'వారికట్టికొట్లంటే నే యిష్టము. వేరేరంగులో కట్టించుకోరు' అని. పిచ్చిది. స్వాభిమానం అబద్ధాలు కూడా చెప్పిస్తుంది...కుక్కకూ కుచేలునికీ సంతానమెందుకిస్తాడో మరి భగవానుడు? ఈ నాలు రాళ్ళ సంపాదనతో ఆపదిమందినీ పోషించాలి ...దివాకరును అన్యాయంగా బాదేశాను. దారిద్ర్యంపై కోపము, యింకొ నాల్గు డబ్బులు సంపాదించి కష్టాల్లోంచి గట్టెక్కలేని నా అసమర్థతకు నా పైన నాకేవున్న కోపము మితిమీరి వాడిపైన చూపించానే గాని, వాడేం తప్పుచేశాడు? కిం కర్తవ్యతా విమూఢుడనై వాణ్ణి అలా చెంపలు వాయించేశాను. పాపిని. వాడే నాకులజ్యోతి... పంతులు గారి కళ్ళల్లో నీళ్ళు గిఱ్ఱున తిరిగాయి.

ఛీ! యిదంతా ఎందుకాలోచిస్తున్నాను. నా జీవితగ్రంథంలోని పుటలు ఎందుకిలా తిరుగబడ్డాయి? ఓఁ. రంగనాథం వచ్చాడుగదూ? నా జీవిత సింహావలోకనానికి కారణం అతడా? మానవప్రకృతి చాలా చిత్రమయింది. గత్యంతరం తెలియనప్పుడు గతించిన విషయాలు జ్ఞాపకం చేసుకుంటుంది. తిరుమల కొండ నెక్కేవారు 'అలిపిరిమెట్లు ఎక్కాము. మోకాళ్ళ ముడుపు దాటేశాము. ఇంకెంత దూరం? ఈ బదరం దాటితే దీనజనబాంధవుడు వేంకటేశ్వరుడు కనిపిస్తాడు.' అని అనుకుంటారు. నిజానికి యిప్పటికి దాటింది చాలా సులభమయిందిగను, ఇక దాటవలసిన దూరం చాలా కష్టమయిందిగను వుంటుంది. కానీ వారలాగే అనుకుంటారు. వారం రోజులుగా సహారా ఎడారిలో నడిచేవాడు నీడ కానక యింకెంత దూరం నడచినా నీడ కనిపించదు. దాటివచ్చిన ఆ యిసుక తిన్నెనీడ క్రిందయినా కూచున్నాంగాదు. అక్కడే కూచునేందుకయినా వీలుండినది. ఈ మిట మధ్యాహ్నపు ఎండలో ఆ మాత్రం నీడకూడా యికముందు కనిపించదేమో! అంటూ గడచిపోయిన వాటిని గురించి ఆలోచిస్తాడు. నైరాశ్యంలో నడచివచ్చేవాడు ముమ్ముందుకు ఆలోచించి ఎండిపోయిన ఖర్జూరపు చెటయినా కనిపించవచ్చు. వాటి నీడలో కొద్దిగానయినా ఆశ్రయం దొరుకవచ్చు అని వూహించనయినా వూహించరు. సరికదా తిరిగి వెనుకకు పయనించడమే మంచిదని ఆలోచిస్తారు. చిత్రమయింది మానవప్రకృతి!...

పంతులుగారు తన వునికిని గుర్తించుకున్నారు. సాక్షి బొమ్మయ్య శ్రేష్ఠి దుకాణం ఎదురుగా కనిపించింది. బజారువీధంతా నడచి సన్నిధివీధి మలుపు ఎప్పుడు తిరిగిందీ గుర్తులేదు. అదే తన కొత్త అంగడి. అంగడిలోనికి ప్రవేశించాడు. కానీ సెట్టిగారు చూచీ చూడనట్లున్నారు. అంగడి రద్దీగావుంది. సెట్టిగారి నటన గ్రహించినా పంతులుగారు చేసుకలిగిందేముంది? అవమానభారంతో అర్ధగంట గడిచింది. పంతులుగారే పలుకరించుకున్నారు. 'ఓహో! హో! మీరా! రండి. కూర్చోండి' అంటూ తనపనిలో నిమగ్నులయిపోయినారు సెట్టిగారు. ఎక్కడ కూర్చోవాలయినో తెలియినా చూపించాడుగాదు. మరలా అర్ధగంట గడిచిపోయింది. అంగడిలో రద్దీకూడా తగ్గిపోయింది. కానీ ఏదో పనివున్నట్లుగానే సెట్టిగారు లెక్కలకాగితాలు తిరగవేస్తున్నారు. ప్రాణం చస్తున్నా నోరు మెదిలించి పంతులు సామ్రగియిమ్మని అడిగారు.

'ఓ, అదే చూస్తున్నానండి. ఎనభయిఏడు రూపాయలా డెబ్బది ఎనిమిది నయాపైసాలు బాకీ తేలుతోంది. ఇప్పుడు చెల్లు ఎంత వేసారు.' అని ప్రత్యేక కంఠస్వరంలో భరోసాగా చిరునవ్వుతో సెట్టిగారు అన్నారు.

'అయివుంటుంది లెండి'...

'అయివుంటుం దేమిటండోయ్? లెక్క మీరే చూడండి.' సెట్టిగారు మధ్యలోనే మాటల నందుకున్నారు.

'చూచే దేముందిలెండి. చెల్లు వేసేటప్పుడు చూచుకుందాంగాని యిప్పుడీసామానివ్వండి.'. మెల్లగా వినయంగా అన్నాడు.

ఒక్కసారిగా సెట్టిగారు తేలకండ్లు వేసేశారు. 'ఏమిటీ!' జీతాలు వచ్చినప్పుడు కూడా యివ్వకుంటే యింకెప్పుడయ్యా మీరిచ్చేది? ఇట్లయితే యీఅంగడి ఏంకావాలనుకున్నారు?...గొంతు తారస్థాయినందుకో జూస్తున్నది.

ఒక్క నెలజీతమే వచ్చిందండి. ఇంకా వాళ్లు నెలజీతం రావాలి. ప్రస్తుతానికి......

'పోనయ్యా చాలుగాని చెప్పావ్ మహా. మేం మీకేమీ ఋణపడలేదుగాని వచ్చేనెలలో లెక్క తేల్చి మరుపని చూడండి? గడియారం 'టంగ్' అని మోగి పన్నెండున్నరగంట చూపింది. సెట్టిగారు భోజనానికి వెళ్లిపోయారు.

పంతులు అటూ యిటూ చూచి గబగబా మెట్లు దిగి వచ్చేశాడు. ఇపుడేంచేయాలి? ఇంకెవరినడగడం? అడిగిఅడిగి వున్న కాస్తపరువుకూడాపోయింది. ఇచ్చేవారేమోలేరు. హేభగవాన్,యీదారిద్ర్యజీవితమెందుకిచ్చావయ్యా? లోకంలో యీ విషమపరిస్థితుల కల్పించడమే నీ సృష్టయితే నీలో మానవత్వంకూడా లేదని యీమానవులు ఎందుకు శంకించకూడదయ్యా? తిండీ బట్టలకోసం, పరువుమర్యాదలకోసం తపించే మానవానీకానికి దిక్కు తెన్నూ లేదు. భోగభాగ్యాలకోసం మానవుడు తోటిమానవుణ్ణి నలగద్రొక్కేస్తున్నాడు. కడుపుకక్కూర్తికి తైవాని తప్పుచేతల్లో తనజీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారు బీదలు. మానవజీవిత పరమార్థమింతేనా?"—అపీనుని పంతులుగారిని గ్రుద్దుకున్నాడొకడు. పడబోయి నిలద్రొక్కుకుని పరధ్యానంగా తానే ఎదుటివాణ్ణి గ్రుద్దుకున్నాననుకున్నాడు పంతులు. క్షమాపణ చెప్పబోయే సమయానికి తనజేబులో చేయి మెసలడం గుర్తించి ఆచేయి నదిమిపట్టుకున్నాడు—'ఏరా జేబులు కొట్టాలని చూస్తావ్? సిగ్గులేదూ?'...ఏంటయ్యా ఎదురుగా మనిషుండేది కూడా తెలియుడంలే. చేయి విడువు' కసురుకున్నాడు ఎదటివాడు.

వాని మాయోపాయానికి పంతులుకు నవ్వు వచ్చింది. 'బాగుంది నాయనా! నన్నే కసురుతున్నావా? అవన్నీ నాకు తెలిసినవేగాని నీకీ పాడు బుద్ధేమిటిరా? పోలీసుల కప్పగిస్తే ఏమవుతావు?" మాటల్లో పంతులుచేయి జారిపోయింది. ఒక్కవుదుటుగా ఆ వ్యక్తి గుంపులోదూరి మాయమయ్యాడు.

'జీవన సమస్యలు మానవుణ్ణి ఏవిధంగా తయారు చేస్తున్నాయి? పాపం. నా జేబులో చేయి వేశాడు. కోటు చూచి ఏదోవిధంగా వూహించి వుంటాడు. కానీ ఈ నాగరికతాబురఖాల మాటున వుండేనగ్న మానవరూపం ఎలా కనిపిస్తుంది? కడుపుకోసం ఒకడు సూటు బూటులు వేసి పట్టపగలు మోసాలుచేస్తున్నాడు. ఒకడు చాటుమాటుగా జేబులు కొడుతున్నాడు. ఒకడు చింకి పేలికలతో భిక్షాటనం చేస్తున్నాడు. ఒకడు కండలు కరిగించి బండలు పిండిచేసి పిడికెడన్నానిక్కూడా నోచుకోక పస్తులు చస్తున్నాడు. హాతవిధీ! ఇదా ప్రపంచం?......

బ్రతుకు బరువు

మిత్రులనుకున్న వారి ఇండ్లకంతా పంతులు తిరిగి వట్టిచేతులతో వచ్చేశాడు. రోడ్డులో కనిపించే దృశ్యాలన్నిటికీ నిర్వచనాలిచ్చుకుంటూ మెల్లమెల్లగా ఇంటికొచ్చేశాడు పంతులు. రంగనాథం మంచి నిద్రలో వున్నాడు. వంటింటిలోని ఆదిలక్ష్మమ్మ అలికిడు విని పలకరించింది. ప్రక్కింటావిడ నడిగి కాఫీమాత్రం కాచి యివ్వగలిగిందట. కాఫీ త్రాగిందే తడవుగా గురకనిద్రలో బడిపోయినారట ఆ వచ్చిన అతిథిగారు. కాఫీ కాచి ఇచ్చేటప్పటికే! పంతులుగారు నన్నిక్కడ దిగవిడిచి యెక్కడికి దయచేశారు. స్వామిగా వున్నారే!' అన్న వాక్యాలు నిద్ర వచ్చేంతవరకూ వుచ్చరించుకుంటూ వుండేవట. ప్రస్తుతం ఆతిథ్య సత్కారాలకు యెటయినా పంతులుగారే సరి చేయాలట. పన్నెండుగంటలకు 'సైరన్' అప్పుడే వినిపించిందట...వినడం చాలించి పంతులు మంచువాలో వచ్చి కూర్చున్నాడు పిల్లలు నానా అల్లరి చేస్తున్నారు. తనబుఱ్ఱలో పదుగులిడే వేయి గొలుబండ కూతల్లాగా కేరింతలు కొడుతున్నారు. ఒక్కసారి కసురుకుందా మనుకున్నాడు. 'ఏం? వాళ్ళయినా సంతోషంగా వున్నారు. నీలాగా వుండలేదనేనా వారిపై కోపం. ఇది అసూయే గదూ!' కొరడా పెట్టులాగా ఈ భావం మెదడులో చెళ్ళుమన్నది. తేరుకునేసరికి నాన్నా! 'నాన్నా! కోటు క్రిందపడి పోయిందినాన్నా. సునీతే నాన్నా క్రిందతోసింది' అని దివాకరం చెప్పడం వినిపించింది.

తన ధ్యాసలోనే నిమగ్నమై నోరు కదపకుండా యాంత్రికంగా లేచి యింటోకి వెళ్ళిన పంతులుకు చిందరవందరగా పడిన కాగితములమధ్య 'పర్సు' ఒకటి కనిపించింది. చిలుకకొయ్యనుండి జారిపడిన కోటుజేబులోని కాగితములవి. వాటన్నిటితీసి కోటు జేబులో ఉంచేసి కోటు చిలుకకొయ్యకు తగిలించాడు. తిరిగివచ్చి తిన్నెపై యథారీతి పంతులు కూర్చున్నాడు

'సర్వానర్థాలకు దారితీసేది ధనమే' అని సెలవిచ్చిన పెద్దలు ఆ ధనం లేకుండా ఎలా జీవించ సాధ్యమౌతుంది; అనే విషయం సెలవిచ్చారు కాదు. సత్యం న్యాయం, ధర్మం, కర్తవ్యం పరువు. ప్రతిష్ట, నీతి, నిజాయితీ, మర్యాద—ఇన్ని అంశాలు కల్పించి బ్రతుకమన్నారు. ఆ బ్రతుకునకు ధనం ఏమాత్రం అందుబడిలోనికి రాదన్న విషయం ఆలోచించనే లేదు. ధనవంతుడు తనసి అంశాలను ఏమాత్రం లెక్కించడు అట్లు లెక్కిస్తూ కూర్చుంటే ధనవంతుడే అయివుండడు. ఇక ధనవంతుడుగా వుండజాలడు. కానీ అవన్నీ వాని పాదాలను దాసులౌతున్నవి. సమాజంలో చెలామణీ కాగలుగుతున్నాడు. లేసి పెరచుట్టూ యీగల్లాగా సమాజం వానిచుట్టూ ముసురుకుంటున్నది. ధనార్జనలో జీవితంలో అతడీ నియమాలు పాటిస్తున్నాడా? ఇవేమీ పాటించకుండా ఆర్జించిన ఆ ధనమున్నంతకాలము యివన్నీ వానికి లభ్యమై లొంగిపోతున్నవి. ఆ ధనం కాస్త తొలగిపోయినప్పుడు యివి వెళ్ళిపోతున్నాయి. వాటన్నిటే పాటించి చేయిచాపిన వారికి పాటి మన్ననకూడా లభ్యం కావడం లేదు. ఏమిటీ ధనమహిమ?

నాముఖ్యకు నాకు ఏముంది? మిత్రుణ్ణి గౌరవించే పాటి పరిస్థితులుకూడా లేవు. సమాజంలో చేయిచాపితే చెంపపెట్లు లభిస్తాయేగాని చేరెడు బియ్యమన్నా లభించవు. ఎందుకని? పరువూ ప్రతిష్ఠలు ఎంతవరకు ఏడిపించగలవో అంతవరకు ఏడిపిస్తాయే గాని మానవుని జీవన సమస్యలను ఎక్కడ తీర్చగలుగుతున్నవి? ఏమిటి గౌరవ మర్యాదలు? మర్యాదకోసం ముగిచావడం మర్యాదయా? గౌరవంకోసం కుళ్ళి కృశించిపోవడమే గౌరవమా? మానాభిమానములని మనసును శోధించుకోవడం మంచిదా? ఇంతచేసి కూడా తద్వ్యతిరిక్తంగా అవమానం జరగడం లేదా? అందుకనే రంగనాథాన్ని కొంత డబ్బు అడుగుదాం? ఇవ్వకపోతాడా? అతిథిగా వచ్చిన మిత్రుణ్ణే ధనమడగడమా? ఇంతకన్నా సిగ్గుచేటు విషయం యింకేముందోయ్? తన్నుతానే చీదరించుకున్నాడు రామయ్యపంతులు

వర్తమాన పరిస్థితుల ననుసరించి మానవుని బుఱ్ఱలో నీతులు, శాస్త్రాలు మెదలుతూవుంటాయి. తానెప్పుడో చిన్నప్పుడు చదువుకొన్న నీతి శాస్త్రంలోని శ్లోకం జ్ఞప్తికి వచ్చింది.

"భార్యా వియోగశ్చ జనాపవాదః
ఋణస్య శేషః కుజనస్య సేవా
దారిద్ర్యకాలే ప్రియదర్శనంచ,
వినాగ్నినా పంచ దహంతి కాయమ్"

సరిగ్గా చెప్పాడెవడో నీలాంటి దౌర్భాగ్యుడు. అగ్గి లేకుండా యీ అయిదు శరీరాన్నీ తగులబెట్టేస్తాయట.

ఎంతబాగా చెప్పాడు. ఇట్టివి సంభవించినా బ్రతికి వుండడం జీవచ్ఛవంగా గాక మరేమిటి? ఎందుకీ బ్రతుకు? ఎక్కడో బడి చావడం మంచిది. రెండు చేతులతో తల గట్టిగా అదిమి పట్టుకున్నా ఇప్పటికి యెందుకూ పనికిరాని ఆలోచనలు సుళ్ళులాగా పుట్టుకొని వస్తూనే వున్నవి.

ఎందుకు నేనిలా కుమిలి చావాలి? నా పరిస్థితుల నెందుకు దాచుకోవాలి? అంతమాత్రం నన్నర్థం చేసుకోలేడా రంగనాథం? ఇందులో తప్పేమిటి?...తప్పు లేదు. కానీ తప్పులేని వాటన్నిటీ వెల్లడిచేసి ఆచరించగల అవకాశం మనోధైర్యము వుండేవుంటే యీ దశ యీ ప్రపంచంలో ఎందుకుంటుంది? ఈ ధనవంతుల తప్పులను విచారిస్తే వాళ్ళకు మిగిలేదేమిటి? పరువూ ప్రతిష్ఠలు బుగ్గియైపోవూ? వారివద్ద వుండే ఆ ధనంలో చిల్లి పైసాయైనా వారికి మిగులుతుందా?...మరలా ఆ పెడవాదము వస్తూవుందే? అదంతా అనవసరము. రామయ్యపంతులు లేచి యింట్లోకి వెళ్ళినాడు.

రంగనాథం మంచి నిద్రలో వున్నాడు. రెండు మూడుసార్లు పిలిచినా పలుకలేదు. అనవసరంగా నిద్రాభంగం చేయడ మెందుకు? ఇప్పుడు నిద్ర లేపడం కూడా మంచిది కాదు. భోజనం తయారయిన తర్వాత లేపడం మంచిది. అయితే డబ్బుమాట? జేబులో కావలసినది తీసుకుందాం. లేచినతర్వాత చెప్పేద్దాం. లేదా ఎట్లయినా సరిచేసి తిరిగి యిచ్చేదాం. మేము చనువుకు చెటప్పుడు ఎన్నిసార్లు ఒకరినొకరు అడుగకనే జేబులోంచి తీసికోలేదు పంతులు ఆలోచిస్తున్నాడు. తన ఆలోచన తనకు సబబుగానే తోచింది. కానీ ఏదో జంకుగానే వుంది. చిలుకకొయ్యకు తగిలించిన కోటుదగ్గరకు వెళ్ళాడు. బిడియంగానే వుంది. మెల్లగా పర్సు పైకితీశాడు. చిల్లర కనిపించింది. ఇంకొక పొర తెరచాడు. పదిరూపాయల కాగితం కనిపించింది. కొద్దిగా తటపటాయించాడు. తొందరతొందరగా ఆ కాగితాన్ని తీసి తన జేబులో ఉంచుకొని పర్సు యథారీతిగా వుంచేశాడు. రామయ్యపంతులు బజారువైపు నడిచాడు.

3

'ఏమిటే రామయ్యా? ఇవన్నీ! బోలెడు వంటకాలు చేయించావ్. గారెలు బలేమజాగా వున్నాయే!' రంగనాథం భోజనం చేస్తూ పాకశాస్త్ర పరీక్ష చేస్తున్నాడు

రామయ్యపంతులు తలవూపుతూ వున్నాడే గాని తనలో తాను ఎంతో మథనపడుతూ వున్నాడు. తను పదిరూపాయలు తీసిన విషయం రంగనాథంతో చెప్పాలని అనుకుంటున్నా చెప్పలేకపోతున్నాడు. రెండు మూడుసార్లు నోటివరకు వచ్చిన మాటలు నాలుకపైన్నే వుండిపోయాయి. ఆ యాతనాస్థితి అట్టి యాతన బడినవారే గుర్తించగలరు. పంతులుగారి బుద్ధి వేడెక్కి ఆలోచనలలోనికి దిగింది 'ఎక్కడయినా సరిచేసి తిరిగి యథాప్రకారం ఉంచేయడం చాలా మంచిది. వడ్డీల సేట్ జీ ఎవరికయినా యిస్తాడుకదా! వారానికి రూపాయకు బేడవడ్డీమాత్రం తీసుకుంటాడు. పోతేపోయింది. సమయానికయినా యిస్తున్నాడు గదా! ఇప్పటివరకు అక్కడికి వెళ్ళకుండా ఎట్లో గడుపుకొన్నాను. ఈ దినం అక్కడకూడా చేయి చాపేయబోతున్నాను. ఎటుజరుగవలెనో అటు జరుగుతుంది. అక్కడ తెచ్చి యథాప్రకారంగా ఉంచేదాం ఇంతమాత్రానికే రంగనాథానికి చెప్పకపోతే యేం? రామయ్యపంతులు ఒక నిశ్చయానికి వచ్చేశాడు.

'నలభీమపాకాలంటారే-అది నిజమేనంటావా రామయ్యా? ఆడవాళ్ళచేతి పాకాలు అమృతానికన్నా మిన్న అంటేకూడా అతిశయోక్తి ఏమీ వుండదుగాని...

'అసంబద్ధంగా మాత్రం వుంటుంది.' అంటూ వంటయింట్లో ఆడపిల్లలు నవ్వుకుంటున్నారు. కానీ అవన్నీ రంగనాథానికి వినిపించడంలేదు.

...మగవాళ్ళ చేతిపాకాల నేమిటయ్యా యీ పిచ్చిపురాణాల్లో పొగడడం? ఆహా. నాకు తెలియకడుగుతాను. ఆ భీముడికీ, ఆ నలుడికీ ఏ ఏ కూరలో ఎంతెంత చింతపండు వేయాలనో తెలుసా? అంట— రంగనాథం పాకశాస్త్రవిమర్శ వంటింటిలోని జానకీ సరోజలకు కడుపుబ్బ నవ్విస్తూంది. నవ్వలేక పడి చస్తున్నారు.

ఈ పాకశాస్త్ర విమర్శలకు మధ్య మధ్య పెదవిపై నవ్వుతో పంతులు జవాబులిస్తూనే ఉన్నాడు. కానీ జవాబుల నపేక్షించే ప్రశ్నలు గావు. రంగనాథంవి. రంగనాథం భోజనకార్యక్రమం గంటలో పూర్తి

చేసుకుని లేచాడు. తాంబూలం సేవిస్తూ పునః శయ్యాగతుడయ్యాడు.

పంతులుగారి శరీరం మిత్రునితో సంచరిస్తున్నమాట నిజమేగాని మనస్సు ఎక్కడెక్కడో సంచరిస్తూవుంది. తొందర తొందరగా యింటిలోని పతిని నిద్రింపజేసి వెచ్చమిచ్చే విటునికోసం బయలుదేరే భోగముచానలా రంగనాథాన్ని విడిచి రామయ్య పంతులు సేట్‌జీఇంటికి బయలుదేరాడు. మండుటెండలో చెమటగా చిత్తడియౌతున్న కోటు సవరించుకుంటూ పంతులు సేట్‌జీఇంటికి వెళ్ళాడు. దరిద్రునికి వడగండ్లవానే ఎదురౌతుందట. ఎండలో మాడిపోతున్న బట్టతల వానిపైనే తాటిపండు పడుతుందట. అవును. ఆ మాటలు నిజమైనవే. పంతులుపట్ల అక్షరాలా నిజమైనవి. సేట్‌జీ యింటిలో లేడు. వ్యాపారార్థం బయటవూరు వెళ్ళాడు. వారంరోజుల్లోగాని రాడు. పిడుగు పడినా రామయ్యపంతులు చలించి వుండడు. ఇప్పుడింకా దారుణంగావుంది పరిస్థితి. హతాశుడైన పంతులు వూరికి వుత్తరంగా నడిచి ఒక చిన్న పొదలో కూచున్నాడు. రెండు ప్రక్కలా గుచ్చుకునే ముండ్లు కూడా పంతులుగారిని తమవైపు మళ్ళించుకోలేకపోయాయి. అలా చేపడి నిద్రబోయిన పంతులుకు మెలకువ వచ్చేసరికి తత్తరపాటు కలిగింది. కోటునకు గుచ్చుకొన్న ముండ్లను దులుపుకుంటూ వడివడిగా యింటికి నడిచాడు.

గ్రంథకర్తలకు, ప్రచురణకర్తలకు విక్రేతలకు

ప్రత్యేక సదుపాయములు!

మన దేశంలో గ్రంథప్రచురణ చాలా వెనుకబడివుంది. ప్రచురణసంస్థలు విరివిగా లేక చాలామంది గ్రంథకర్తలు తమ గ్రంథాలు తామే అచ్చువేసుకుని అమ్ముకుంటున్నారు. ఉన్న కొద్ది ప్రచురణసంస్థలకు కూడా విశేషలాభాలు వుండటంలేదు. ప్రచురణావకాశాలు ఇలా వుండటంచేత వైజ్ఞానిక ప్రచారంకూడా చాలా వెనుకబడిపోతున్నది.

భారతి కేవలం వైజ్ఞానిక ప్రచారానికి యేర్పడిన వ్యవస్థ. గ్రంథప్రచురణను ప్రోత్సహించే తలంపుతో, గ్రంథముల ప్రకటనలకు సంబంధించినంతవరకు తన ప్రకటన రేట్లు తగ్గించుకుని కొంత సదుపాయం చేస్తున్నది.

ఈ అవకాశాన్ని వినియోగించుకోదలచిన గ్రంథకర్తలు, ప్రచురణకర్తలు, విక్రేతలు ఈ దిగువ చిరునామాకు వ్రాసి ఈ ప్రత్యేక సదుపాయపు రేట్ల వివరములు తెలుసుకొనవచ్చును.

అడ్వర్టైజ్‌మెంట్ మానేజర్, భారతి

7, తంబుచెట్టివీధి, మద్రాసు-1

రంగనాథం హడావుడిగా ప్రయాణ మౌతున్నాడు. పంతులు రాగానే—'ఏమిటయ్యోయ్! ఒక్క క్షణమయినా యింట్లో కాలు నిలచేటట్లు లేదే! సరే గాని వస్తాను రామయ్యా. ఓ గంట అప్పుడే ఆలస్యం అయిందే. బస్సు మిస్సయిపోతుందేమో!' రంగనాథం మాట్లాడుతుంటే కోడూరు మిటలో జనతా ఎక్స్‌ప్రెస్ కదిలిందన్నమాట. ఇంద్రజాలికుడు తన యింటికి వచ్చినట్టుంది రామయ్యపంతులు పిల్లలకు. రంగనాథం తొందర ఆతని దుడుకు నడక చూడ చాలా వింతగావుంది. పంతులుగారి పిల్లలందరూ చుట్టూరా నిల్చున్నారు. వాళ్ళను చూడగానే రంగనాథానికేదో చటుక్కున జ్ఞప్తికి వచ్చింది. మాయామంత్ర కరండంకోసం జోలి తడుములాడుకుంటున్న మాంత్రికునిలా కోటు జేబులు తడుముకొని పర్సు బయటికి దీశాడు రంగనాథం. మాయాబుట్ట తెరిచి మామిడికాయలు రాలుస్తాడేమోనని పిల్లలందరూ రెప్ప వాల్చకుండా చూస్తున్నారు. రంగనాథం పర్సు అందరికీ ఓ వింతంగా ప్రదర్శించి ఒ పుటుక్కున బట్టన్ నొక్కి తెరిచేశాడు. అటూ యిటూ ఆడించి చిల్లర డబ్బులు గలగలలాడించాడు. కంగారు కంగారుగా పర్సు ఆడించేస్తూ—"ఇందులో పది రూపాయల కాగితం లేదే? రామయ్యా ఏమయింది? ఈ యింటిలో దొంగలు కూడావచ్చారా కి?" మాట్లాడేస్తున్నాడు రంగనాథం.

కత్తివేస్తే నెత్తుటిచుక్క లేదు పంతులుగారి ముఖంలో. వేయి పిశాచాలు గజ్జెకట్టి కాటిసీములో ఆడుతున్నట్లు రంగనాథం మాటలు అతని మస్తిష్కములో నాట్యం చేస్తున్నాయి లక్ష హాలాహలాల కోలాహలాలు అతణ్ణి చుట్టుముట్టివేశాయి. అమాంతముగా ఆకాశం విరిగి అతనిపై పడిపోయింది. వేయి బాహువుల యినపటుండు శక్తి కత్తివటయింది. తల వంచుకొని— 'నేనే తీశాను రంగనాథం—' అన్నాడు.

"ఆఁ! నీవేతీశావా? చాటుగా నన్నడగకుండానే తీశావా?"—వజ్రాయుధ ప్రహారం ఎవరికీ అంతబాధ యిచ్చివుండదు. యమలోకంలోని ముళ్ళపంజరం ఒక్కసారిగా శరీరాన్ని తూట్లు చేసివేసినట్లుంది.

'నాన్నా! దొంగతనం చేశావా? నేను చేశానని మరి నన్నుకొట్టావే!' దివాకరం పరుగెత్తుకుంటూవచ్చి పంతులును వూపివూపి ప్రశ్నిస్తున్నాడు.

కొరడా పెటుల్లా చెడేల్‌మన్నాయి దివాకరం మాటలు. పిండారీలు కంఠాలు తెగిన కన్నెల చెంగటి కొరడాలతో కలిగించే బాధయింది. చర్మం చిట్లి కండలు ప్రిదిలి, ముఖం నజానజయిపోగా పడే బాధననుభవించాడు రామయ్యపంతులు. తల పైకెత్తి చూశాడు. ప్రళయకాలంలో సప్త సముద్రాలు పొంగెత్తి పొంగిపోగా జలప్రళయంలో తానూ మునిగిపోతూ కన్ను తెరచి చూచినట్లుంది. ఎదుట నీరే కనిపించింది. కనురెప్పలు కదిపి తేరిపారచూశాడు. ఉసిరికాయలంత రెండు కన్నీటిబొట్లు నేలరాలిపోయాయి.

'దివాకరా!...' ఆ పిలుపులోని ఆ చూపులోని ప్రశాంతత విశేషింప బడేదిగాదు. అర్థం చేసుకోవాలంటే యోగివేమన్న శిష్యత్వం వేయిజన్మలు చేయాలి. పంతులుగారి కంఠంలోని కన్నీరు యిగిరిపోయింది.